విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

బుధవారం 08 జనవరి 2025 8 పేజీలు

అరకొరగా సాగునీరు!

నీరు పారని మైలవరం మెయిన్ బ్రాంచి కాలువ

- చివరి భూము లకు చేరని సాగర్ జలాలు
- మూడవ జోన్ రైతులకు అన్యాయం
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

నాగార్జునసాగర్ నుంచి ఎడమకాల్వ ద్వారా విడుదలయ్యే సాగర్ జలాలు చివరి పొలాలకు చేరడం లేదు... రాష్ట్ర విభజన అనంతరం సాగర్ జలాల పంపిణీలో మన రాష్ట్రానికి అందాల్సిన జలం విషయమై కేఆర్ఎంబీ చేసిన సూచనలు ఈ ఏడాది కూడా అమలుకు నోచుకోని దుస్థితి నెలకొంది. పాలేరు రిజర్వాయర్ నుంచి కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాల మధ్య వాటాలు కుదిర్చి, మన రాష్ట్రానికి ఏ సమయంలో ఎంత నీరందించాలనే విషయాన్ని స్పష్టం చేసింది. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా మూడవజోన్ పరిధిలోని రైతులకు అన్యాయం జరుగుతోంది.

విశాలాంధ్ర-విస్సన్నపేట : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు మూడవజోన్‌కు అధికారులు సాగర్ జలాలను విడుదల చేశారు. మూడవ జోన్ పరిధిలో ఉన్న సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు పంపిణీ చేయాల్సిన జలాలను ఆలస్యంగా పంపిణీ చేయటం, వచ్చిన నీరు కాస్తా ఇవ్వాల్సిన రీతిలో కాక అరకొరగా అందించటంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎగువ నుంచి వస్తున్న కొద్దిపాటి నీటిని దారి మళ్లించి, ప్రయోజనాలు పొందేందుకు రైతులు సైతం అక్రమార్కులుగా అవతారమెత్తి, అడ్డదారులు తొక్కే ప్రయత్నాలు చేస్తుండగా, అధికారులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలోని రెండవ జోన్‌లో తిరువూరు, గంపలగూడెం, జగ్గయ్యపేట మండలాలు ఉండగా, మూడవ జోన్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని తిరువూరు, మైలవరం, నూజివీడు, నందిగామ,

మిగతా 2 లో ...

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 50 సంవత్సరాల నుంచి అనేక విభాగాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ ఛేశారు. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడా హనుమంత రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం లాంటి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నటువంటి స్కీమ్ వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని తక్షణమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, రాజకీయ కక్ష సాధింపులు అరికట్టాలని, విధులలో మరణించిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని తదితర ప్రధానమైనటువంటి డిమాండ్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను

మిగతా 2 లో ...

కోడి పందేలపై ఉక్కుపాదం

సెక్షన్ 144 అమలు : పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: కోడి పందేలపై ఉక్కుపాదం మోపినట్లు, పందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కోడి పందాలు నిర్వహించుట-పాల్గొనుట చట్టరీత్యా నేరం అనే గోడపత్రాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, సెక్షన్ 10/1974 ప్రకారం కోడి పందెములు నిర్వహించుట చట్టరీత్యా నేరం అన్నారు. అందులో పాల్గొన్నవారు గాని, ప్రోత్సహించిన వారు గాని ఏ స్థలములో నిర్వహిస్తారో వారికి

మిగతా 2 లో ...

బాల్య వివాహ రహిత భారత్‌కు కృషి

బాలికల విద్య, ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.బి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : బాల్య వివాహ రహిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా.బి.లక్ష్మీశ అన్నారు. సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికట్టాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం బాల్య వివాహ ముక్త భారత్ ప్రచారంలో భాగంగా బాల్య వివాహాల నిషేధ అధికారుల(సీఎంపీవో)తో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహమనేది ఓ సాంఘిక దురాచారమని, అది బాలికలను విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ఇతర దుష్పరిణామాలపై ప్రజల్లో

మిగతా 2 లో ...

‘సమాచార దర్శిని’ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సాహో జీజీహెచ్ గుంటూరు ‘సమాచార దర్శిని’ పుస్తక కవర్ పేజీని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, జాయింట్ డైరెక్టర్ సుధారాణిలు మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఈ సమాచార దర్శినిలో జీజీహెచ్‌కు సంబందించిన అన్ని విషయాలు ప్రజలకు, రోగులకు సులభతరంగా అర్ధమయ్యే విధంగా పొందుపరచినట్లు తెలిపారు. రోగులు, రోగులను తీసుకొచ్చే వారి బంధువులకు ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఒ డాక్టర్ సతీష్‌కుమార్, ఏఆర్ఎంఒ ప్రియాంక, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 పద్మ, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ పుస్తక మహోత్సవం మంగళవారం ఆరువ రోజుకు చేరింది. ఈ మహోత్సవంలో ప్రజలకు అర్థమయినదానికన్నా అపార్థానికి గురైన కవి ఆలూరి బైరాగి అని సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. సభకు మాధవరావు అధ్యక్షత వహించారు. మొదటి కార్యక్రమంగా కవి ఆలూరి బైరాగి శతజయంతి సభ నిర్వహించారు.

(మొదటి పేజీ తరువాయి)

అరకొరగా సాగునీరు !

గన్నవరం, పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గాలు ఉన్నాయి. మొదటి జోన్ మొత్తం, రెండవ జోన్‌లో ఎక్కువ భాగం తెలంగాణా రాష్ట్రంలో ఉండగా, మూడవజోన్ మొత్తం మన రాష్ట్ర రైతుల పరిధిలో ఉంది. పాలేరు రిజర్వాయర్ నుంచి కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాల మధ్య వాటాలు కుదిర్చి, మన రాష్ట్రానికి ఏ సమయంలో ఎంత నీరందించాలనే విషయాన్ని స్పష్టం చేసింది. నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా మూడవజోన్ పరిధిలోని రైతులకు అన్యాయం జరుగుతోంది. తొలి రెండు జోన్‌ల రైతులు అధికభాగం నీటిని వినియోగించుకుని, మూడవజోన్‌కు అరకొరగా పంపిణీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం, గత ఏడాది నవంబరు నెల నుంచి ఈ ఏడాది ఏప్రియల్ 15వ తేదీ వరకు మన రాష్ట్రానికి కనీసం రోజుకు 1500 క్యూసెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా, ప్రస్తుతం రామచంద్రపురం (117.కిమీ. రెగ్యులేటర్)వద్దకు 500 క్యూసెక్కుల నీరు సరఫరా జరుగుతోంది. ఈ నీటిని వివిధ కాలువలకు పంపిణీ చేయాల్సి ఉండగా, అధికారులు తక్కువ నీటి సరఫరా కారణంగా వారబందీ విధానం అమలు చేస్తున్నారు. అధికారులు నీటిని విడుదల చేసే కొన్ని గంటల ముందుగానే చంద్రుపట్ల గ్రామం వద్ద రేగటివాగుపై ఉన్న యుటి(అండర్ టన్నెల్)కు గుర్తు తెలియని వ్యక్తులు రంధ్రం వేశారు. చంద్రుపట్ల ఆయకట్టు రైతులు గుర్తించి, అధికారులకు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని, రంధ్రాన్ని మూసివేసి, సిబ్బందితో కాపలా ఏర్పాటు చేసినట్లు ఏఈ లోకేశ్వరి వివరించారు. ఇదేవిధంగా మరికొన్ని చోట్ల కూడా ప్రయత్నాలు జరిగే అవకాశం ఉన్నా, అప్రమత్తంగా ఉన్నామని ఆమె అన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఏఈ లోకేశ్వరి విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకుని, కేఆర్ఎంబీ నిబంధనల మేరకు మన వాటాగా రావలసిన నీటిని మన ప్రాంతానికి తీసుకురావాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నిరసిస్తూ నేడు పెద్దఎత్తున దేశవ్యాప్తంగా నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. స్కీమ్ వర్కర్ల న్యాయమైన కోరికల సాధన కోసం రాబోయే రోజుల్లో పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ, ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్వరూప రాణి, భూషణ కుమారి, ఉదయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్‌కు కృషి

అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులకూ అవగాహన కల్పించటంలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చేసిన చట్టాలు, ప్రవేశపెట్టిన కార్యక్రమాలు, విధానాల పటిష్ట అమల్లో మహిళాభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్ తదితర శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బాలికల విద్య, ఆర్థిక సాధికారతపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, బాల్య వివాహాలను నివారించేందుకు విద్య అనేది కీలకమని, విద్యతో పాటు సాధికారత కల్పించడం ద్వారా పేదరికాన్ని తద్వారా బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను దూరం చేయొచ్చని పేర్కొన్నారు.

బాల్య వివాహం.. మానవ హక్కుల ఉల్లంఘన

బాల్య వివాహం అనేది మానవ హక్కుల ఉల్లంఘనని, ఈ నేపథ్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తానని, నా కుటుంబం, నా పరిసరాలు, నా గ్రామం, సమాజంలో బాల్యవివాహాలు జరక్కుండా చూస్తానని, బాల్య వివాహానికి చేసే ఏ ప్రయత్నాన్నయినా గ్రామ పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తానని, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్, బాల్య వివాహ రహిత భారత్ కోసం నా గళాన్ని వినిపిస్తానంటూ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడా ఒక్క బాల్య వివాహం కూడా జరక్కుండా సీఎంపీవోలు అప్రమత్తతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నోడల్ అధికార సీహెచ్.సాయిగీత, వాసవ్య మహిళామండలి ప్రెసిడెంట్ డా.కీర్తి, విజయవాడ రూరల్ సీడీపీవో జీ.మంగమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజారాజేశ్వరరావు, సిఎంపీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, ఏఎస్ఐలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

కోడి పందేలపై ఉక్కుపాదం

కూడా వర్తిస్తుందన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే 144 సిఆర్‌పిసి ప్రకారం శిక్షార్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్..

పట్టణ పరిధిలోని లింగగుంట్ల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ అరుణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఆయన పరిశీలించారు. బడికి దూరంగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మార్చి నాటికి 2000 మందికి స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయండి..

ధనుర్మాస వ్రతంలో మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి: ధనుర్మాసం శ్రీ వెంకటేశ్వర స్వామి కి ఇష్టమైన మాసం. ఈ ధనుర్మాసం లో స్వామి వారిని పూజించుకున్నా, దర్శించుకున్నా అందరికీ మంచి జరుగుతుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళగిరి శ్రీశైలనగర్ లోని బాపూజీ విద్యాలయంలో శ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవంలో లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఇలాంటి నెలలో ధనుర్మాస వ్రతాలు చేసుకోవడం వలన అందరికీ మంచిది. ధనుర్మాసం లో దీక్షలు చేయడం వలన పుణ్యం వస్తుంది. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి రావడం నా అదృష్టం. ఈ రూపంలో స్వామి వారి ఆశీస్సులు నాకు కూడా దక్కాయి. ఇటువంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం వలన యువత కు కూడా ఏ నెలలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలో అవగాహన పెరుగుతుంది. మంగళగిరి లో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, కొండపైన ఉన్న పానకాల నరసింహ స్వామి, విజయకీలాద్రి క్షేత్రం ఇటువంటి ఆలయాలను ధనుర్మాసంలో దర్శించుకోవడం చాలా మంచిది. ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి గారికి ధన్యవాదాలు. కలియుగ దైవం అయిన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నానని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు : ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: తెలుగువారికి పెద్ద పండుగైన సంక్రాంతికి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరగబోయే సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మంగళవారం 43వ డివిజన్ విద్యానగర్ 1/5వ లైన్ నందు రూ.51.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, జమ్ముల వీరాంజనేయులు, కొల్లి బాలకృష్ణ, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, పేరయ్య తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

బతికుండగానే చనిపోయినట్లు పింఛను

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును చొరవతో నిలిపివేత

విశాలాంధ్ర-వినుకొండ : బతికి ఉన్న మహిళను చనిపోయినట్లుగా చూపించడం, బీమా డబ్బులు చెల్లించడం, అనంతరం పింఛను నిలిపివేయడం ముక్కున వేలేసుకునేలా చేసింది. తాను జీవించే ఉన్న నెలలుగా పింఛను రాక, అవస్థలు భరించలేక బాధిత మహిళ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల్ని ఆశ్రయించడంలో వైకాపా ప్రభుత్వంలో జరిగిన విషయం బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళితే వినుకొండ పట్టణం, సీతయ్య నగర్, వల్లపు శేషమ్మ 15 ఏళ్లుగా వితంతు పింఛను తీసుకుంటు న్నారు. పింఛనుడబ్బే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. కానీ 2023 అక్టోబర్ నుంచి ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. అదే నెలలో బతికున్న శేషమ్మను చనిపోయినట్లుగా రికార్డుల్లో నమో దు అయింది. ప్రమాద బీమా పేరిట నామినీ ఖాతాలో డబ్బులు కూడా జమ చేశారు. తర్వాతి నెల నుంచి ఆమె పింఛను ఆగిపోయింది. అప్పట్నుంచి బాధిత మహిళ కన్నీటి పర్యంతం అవుతూ ఎంతమందితో కష్టం చెప్పుకున్నా పట్టించుకున్నవారు లేకపోయారు. చివరకు ఇటీవలే బాధిత మహిళ జీవీ ఆంజనేయులును ఆశ్రయించడంతో వినుకొండ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆమె చనిపోయినట్లుగా నమోదు కావడం, ప్రమాద బీమా జమ అన్నింటిపై విచారణ జరిపించాలని ఆదేశించారు. శేషమ్మకు న్యాయం చేయాలని, పింఛను పునరుద్ధరించాలని సూచించారు. ఆయన్ను కలిసిన బాధిత మహిళ శేషమ్మ చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. తనలా మరెవరీ అన్యాయం జరగకుండా చూడాలని వేడుకున్నారు.

ఆశా డే పై మలేరియా అధికారి సమీక్ష

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పద్మశాలిపేట, మారీస్‌పేటలలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రాష్ట్ర ఆశాడే కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ ఈ సమీక్ష సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్ ఎ ద్రావణం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంచుతూ నీటి నిల్వల వలన దోమల వృద్ధి చెందుతాయని తద్వారా వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.దివి కిషోర్, డా.దోనేపూడి హరిణి, సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, శ్రీకంత ఉమాకాంత్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 6, 7 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో మార్చి 6, 7 తేదీలలో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఎడ్యుకేషనల్ పర్‌స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు వచ్చిన పరిశోధన పత్రాలు పరిశీలించి పబ్లికేషన్ తీసుకొస్తామని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యా విభాగం బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ శివలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ సందీప్, డాక్టర్ వసంతరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాలలో దోస్తు వన్ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామస్థాయి క్రీడలు పోటీలు కొనసాగుతున్నాయి. ఈ నెల 4 నుంచి ప్రారంభించిన క్రీడల్లో క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. మొత్తం 28 క్రీడా బృందాలు ఈ క్రికెట్‌లో పాల్గొన్నారు. క్రీడలను ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహిస్తూ వచ్చిన క్రీడాకారులకు మంచినీరు, అల్పాహారం, క్రీడా సామాగ్రిని అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రవాస భారతీయులు జంపాల సుబ్బారావు, గద్దె వాసు, దోస్తు సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని హర్ష, నక్కా చిరంజీవి, శశి, సాయి, పసుపులేటి రవి యాదవ్, కొంగర సుధీర్, రియాజ్, జంపాల శ్రీధర్, జంపాల తిరుమలరావు, చింతమనేని మహేష్, విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటీస్

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

H.M.O.P. No. 189 / 2023

బిట్వీన్ :
అంగిడి నాగరాజు ...పిటీషనర్

వర్సెస్

అంగిడి భవానీ ...రెస్పాండెంట్

టు:
అంగిడి భవానీ, W/o.నాగరాజు, R/o.73-13-513/30, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రక్కన, మెయిన్ రోడ్డు, అమరావతిరోడ్డు, గుంటూరు.(PO, MO & DT),A.P.

పైనెంబరు H.M.O.P.లో రెస్పాండెంట్ ఐన మీకు నోటీసులు పై కోర్టువారి నుండి పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియ చేయమని శ్రీకోర్టువారు. ది.06-02-2025కి వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉ.గం.10-30ని.లకు పైకోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ తరపు వకీలుగారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షమందు తీర్మానించెదరు.

వాయిదా తేదీ: 06-02-2025

పి. చినమస్తాన్, SK. N. మస్తాన్
అడ్వకేట్స్

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 984/2023 ఇన్
యం.వి.ఒ.పి.నెం.893/2018

బిట్వీన్:
కూరపాటి రాజేష్ - పిటీషనరు
మరియు
సయ్యద్ అమీర్ భాషా వగైరాలు - రెస్పాండెంట్లు

టు,
ఆర్-1: సయ్యద్ అమీర్ భాషా, కేరాఫ్ నాగేశ్వరరావు, నివాస డోర్ నెం.31-26-3, సుల్తానాబాద్, తెనాలి, గుంటూరు జిల్లా.

పై నెంబరు యం.వి.ఒ.పి.లోని ఐ.ఎ.నెం. 984 / 2023 ను Setaside the default dismissed Order Dt.24-04-2023ను రెస్టోర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:04-02-2025 కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే వట్టి ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 04-02-2025

రావి మనుదత్త, పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.

పొందుగల వద్ద పట్టాలు తప్పిన గూడ్స్

విశాలాంధ్ర-దాచేపల్లి : నడికూడి జంక్షన్ పరిధిలోని పొందుగల స్టేషన్ సమీపంలో శ్రీనివాసపురం గేటు వద్ద సోమవారం అర్ధరాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గుంటూరు నుంచి నడికూడి మీదుగా గూడ్స్ రైలు తెలంగాణలోని విష్ణుపురం వద్ద ఓ సిమెంటు కర్మాగారానికి లోడింగ్ కోసం వెళ్తోంది. శ్రీనివాసపురం గేటు వద్దకు రాగానే గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గుంటూరు రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేశారు. గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్ళే రైళ్ళను వయా విజయవాడ మీదుగా హైదరాబాద్ వైపు మళ్ళించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చిన తిరుపతి స్పెషల్, నర్సాపూర్, కాచిగూడ రైళ్ళను మిర్యాలగూడ స్టేషన్‌లో నిలిపి వేశారు. మరమ్మతు అనంతరం యధావిధిగా రైళ్ళ రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనపై కమిటీ వేసి విచారణ చేయిస్తామని గుంటూరు డివిజన్ ఉన్నతాధికారులు తెలిపారు.

వీవీఐటీలో ఇంధన రంగంలో సదస్సు

విశాలాంధ్ర-పెదకాకాని : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించబడిన 'ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్'లో భాగంగా ఇంధన రంగంలో అవకాశాల పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సిమెన్స్ ఎనర్జీ ఇండస్ట్రీయల్ టర్బో మిషనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీరింగ్(గ్యాస్ టర్బైన్స్) హెడ్ డాక్టర్ గిరిధర్ కుమార్ ధిన్నే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గారపాడు, హుస్సేన్ నగరంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని గారపాడు, హుస్సేన్ నగరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శాంతి పాల్గొని మాట్లాడుతూ రైతులు రబీలో వేసిన పంటలకు ఈ-పంట నమోదుకు ఆయా రైతు సేవ కేంద్రాలలోని వ్యవసాయ/ఉద్యాన సహాయకులను సంప్రదించి తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు యశస్విని, రాజు, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

దుగ్గిరాల పంచాయతీలో గ్రామసభ

విశాలాంధ్ర-దుగ్గిరాల : దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులు, ఎజెండా తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ బాణావత్ కుష బాయి హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి వివేకానంద, వార్డు మెంబర్ పసుపులేటి వరదరాజులు, చుండూరు ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మురికి కాలువలో పసికందు మృతదేహం

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి మండలం కొలనుకొండలో మంగళవారం దారుణం జరిగింది. మురికి కాలువలో పడేసిన పసికందు మృతదేహం లభ్యమైంది. పసిగుడ్డు పుట్టి కనీసం గంటల వ్యవధిలో కూడా కాకముందే ఆ బిడ్డను కసాయి తల్లి మురికి కాల్వలో పడేసి వెళ్ళిపోయింది. పసికందు మృతదేహాన్ని మంగళగిరి మార్చురికి తరలించారు.

పేద విద్యార్థికి లాప్‌టాప్ అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు : అచ్చంపేట మండల పరిధిలోని కోనూరు గ్రామానికి చెందిన బొగ్గవరపు సాయి.. ఉద్యోగ అవసరాల నిమిత్తం లాప్‌టాప్ అందించటం జరిగింది. కోనూరు గ్రామా విద్యార్థులతో సమకాలీన ఉద్యోగ పరిస్థితులుపై ప్రవాస భారతీయుడు మాగులూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు భానుప్రకాష్ ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మాగులూరి భాను ప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వేగుంట రాణి, వాసిరెడ్డి రవి, గ్రామస్తులు, మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది విధ్వంసం... మాది అభివృద్ధి పథం : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

విశాలాంధ్ర-రెంటచింతల : ఐదేళ్ల వైసీపీ అరాచకాలకు, విధ్వంసాలకి సజీవ సాక్ష్యాలతో శాపగ్రస్తమై, అప్రతిష్ఠ పాలై చరమాంక దశలో ఉన్న వైసీపీ పార్టీకి నిండు నూరేళ్లు నిండాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతలలో పర్యటించిన ఎమ్మెల్యే రూ.50 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్‌లోని టీడీపీ ముఖద్వారం పునర్నిర్మాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైసీపీ విధ్వంసానికి సజీవ సాక్ష్యంగా నిలిచి కూల్చివేతకు గురైన ముఖద్వారం పునర్నిర్మాణానికి టీడీపీ నేత గొంటు ఆదిరెడ్డి పూనుకుని నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజం ప్రశాంతతను కోరుకునే వ్యక్తిని కాబట్టే పల్నాడులో ఫ్యాక్షనిజాన్ని తగ్గించే దిశగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి, ఏపీ శిల్పారామం ఛైర్మన్ మంజులరెడ్డి, సీనియర్ నేత దండే శివయ్య, గొంటు సుమంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, నియోజకవర్గం ఎస్సీ కన్వీనర్ మామిడి రవి, సిద్దయ్య, షేక్ బుజ్జి, దుగ్గింపూడి ఇన్నారెడ్డి, తుమ్మా జోజి రెడ్డి, ఏచూరి వెంకట సైదయ్య, నాళం బాబు, ముని నాయక్ తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీపీఐ జెండాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఆనాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలబడి పోరాటం చేసింది సీపీఐ అని ఆ పార్టీ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు. సీపీఐ 99 వసంతాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెంలో పార్టీ నాయకులు చంద్రా కొండలరావు, నాదెండ్ల మండల ఎండుగంపాలెం గ్రామంలో పర్వతనేని లక్ష్మాధికారిల ఆధ్వర్యంలో సీపీఐ పతకాలను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళ్లూరి బాబురావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యంతో వచ్చిన తర్వాత కూడా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి వివిధ ప్రాంతాల్లో అణగారిని వర్గాలకు అండగా ఉంటూ భూమి కోసం... భుక్తి కోసం.. పేద ప్రజల కోసం విముక్తి కోసం... అనేక ఉద్యమాలు చేసి, లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. మనువాదులు ధ్వంసం చేయాలని చూస్తున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కుల మతాల పేరుతో దేశ ప్రజల మధ్య చిచ్చు రేపే మత విద్వేషాలకు వ్యతిరేకంగా సీపీఐ అనేక దశాబ్దాలుగా పోరాడుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు చినబాబు, మల్లిఖార్జునరావు, చౌటుపల్లి నాగేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తే ప్రతిఫలం అనుభవిస్తారు : గోపిరెడ్డి

విశాలాంధ్ర-నరసరావుపేట: స్థానిక సబ్ జైల్లో అక్రమ కేసులలో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించి మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం, కొత్తపల్లి గ్రామ సర్పంచ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటా కోటేశ్వరరావు ఆయన సోదరులు గంటా కొండలు, గంటా చిన్న కోటేశ్వరరావులపై తెలుగుదేశం పార్టీ వారు అన్యాయంగా, అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు పంపారన్నారు. డిసెంబర్ 25 క్రిస్మస్ పండుగ సందర్భంగా గ్రామ ఎస్సీకాలనీలోని చర్చిలో జరిగే ప్రార్థనలకు రానీయకుండా 35 కుటుంబాలు ఉన్న వైసీపీ కుటుంబాలను, కేవలం 9 కుటుంబాలు మాత్రమే ఉన్న తెలుగుదేశం పార్టీ కుటుంబాలు అధికార బలంతో అడ్డుకున్నారని అన్నారు. వైసీపీకి పోరాటాలు కొత్తేం కాదని, ప్రజల తరఫున పోరాటాలు చేస్తూనే ఉంటామని, ఫిబ్రవరిలో జగన్ జిల్లా పర్యటనలకు వస్తున్నారని, కార్యకర్తలకు భరోసా కల్పిస్తారని, కార్యకర్తలను కాపాడుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ నాయకులు ఇగ్గుటూరి రంగారెడ్డి, ముచ్చుమర్రి వెంకటేశ్వర్ రెడ్డి, దాసరిపల్లి పెద సాంబిరెడ్డి, పడాల హనిమి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలి : విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజారోగ్యంపై ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండే ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీమంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. గుంటూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో మార్పు తీసుకురావడం ఏ మాత్రం సరికాదని, ఈ మార్పు హైబ్రిడ్ మోడల్‌తో ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

10న ఉత్తర ద్వార దర్శనం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి, వైకుంఠపురంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి ఉత్సవం (ఉత్తర ద్వార దర్శనం) సందర్భంగా తెల్లవారు ఝామున 4.30 ని॥ల నుండి శ్రీ స్వామి అమ్మవారలను ఉత్తర ద్వారములో గరుడ వాహనంపై వేంచేపు చేసి భక్తులకు దర్శనము, దక్షిణావృత శంఖముతో తీర్థము ఇవ్వబడునని కార్యనిర్వాహణాధికారి వి.అనుపవమ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

'న్యూటన్స్'లో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-మాచర్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని అలుగురాజుపల్లి నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ సీఐ ఎం వెంకటరమణ హాజరయ్యారు. పోటీలకు మాచర్ల, మండల పరిధిలోని పలు గ్రామాల నుండి మహిళలు భారీగా తరలివచ్చారు. రంగురంగుల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. పోటీలలో 127 మంది పాల్గొనగా మాచర్ల కు చెందిన విజయలక్ష్మి మొదటి బహుమతి రు.10వేలు అందుకోగా , గురజాలకు చెందిన కె ఉమా రెండవ బహుమతి రు.7,500లు, మాచర్ల కు చెందిన లక్ష్మీ మూడవ ప్రైస్ రూ.5,000లు దక్కించుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విజేతలకు కళాశాల కరస్పాండెంట్ జున్ను శ్రీనివాస్ రెడ్డి, సీఐ ఎం వెంకటరమణలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్ రెడ్డి, షేక్ ఖాసిం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **THOTA SHANU** W/o. **Thota Gopinath** R/o. Door No:18-40-27, 3rd Line, Redla Bazar, Near Brahmam Gari Temple, Sangadigunta, Guntur, Guntur District - 522003, Andhra Pradesh, have changed my name from **THOTA VIJAYA** to **THOTA SHANU** (New Name). Hereafter I will be called as **THOTA SHANU** (New Name).

CHANGE OF NAME

I, **THOTA GOPINATH** S/o. **Thota Narayana Rao** R/o. 18-40-27, 3rd Line, Redla Bazar, Near Brahmam Gari Temple, Sangadigunta, Guntur, Guntur District - 522003, Andhra Pradesh, have changed my minor son's name from **THOTA SUBBARAO** to **THOTA PAVAN SIVA SUBBARAO** (New Name). Hereafter he will be called as **THOTA PAVAN SIVA SUBBARAO** (New Name).

దస్తావేజు పోయినది

గుంటూరు సిటీ, గాజులవారి వీధి, రెవెన్యూ కళ్యాణ మండపం ఎదురు, డోరు నెం. 28-4-9రు కాపురస్తులు **లేటు మండలనేని పుల్లయ్య గారి కుమారుడు మండలనేని సాంబయ్య** అను నేను తెలియజేయునది ఏమనగా- నా పేరిటకు ఫిరంగిపురం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు (ఇంటి దస్తావేజు) **నెం. 838/1985 ఒరిజినల్‌ను ది. 04-01-2025న** నా ఇంటి వద్ద నుండి కన్నావారితోటలోని ఫొటోస్టాట్ సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం వెళుచుండగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

CHANGE OF NAME

MOHAMMAD AARIFUDDIN (Old Name), S/o. Shaik Jani Basha, D.No.7-598/1, Nidamarru Road, Near Bilal Maseed, Mangalagiri-522503, Guntur District, A.P. Hence, I have changed my name as **SHAIK MOHAMMED AARIFUDDIN (New Name)** hereafter My name is known as **SHAIK MOHAMMED AARIFUDDIN (New Name).**

CHANGE OF NAME

SHAHEDA BEGUM (Old Name), W/o. Shaik Mohammed Aarifuddin, D.No.7-598/1, Nidamarru Road, Near Bilal Maseed, Mangalagiri-522503, Guntur District, A.P. Hence, I have changed my name as **SHAIK MOHAMMED SHAHEDA BEGUM (New Name)** hereafter My name is known as **SHAIK MOHAMMED SHAHEDA BEGUM (New Name).**

అంధుల పాలిట ఆరాధ్య దైవం బ్రెయిలీ : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జన్మదిన వారోత్సవాలు సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు అధ్వర్యంలో లూథర్స్ బ్లైండ్ హై స్కూల్‌లో లూయిస్ బ్రెయిలీకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 1809 సంవత్సరం జనవరి 4 పారిస్కు తూర్పున ఇరవై మైళ్ల దూరంలో ఉన్నహెూకూ ప్రేహె అనే చిన్న గ్రామంలో జన్మించారని, బ్రెయిలీ తల్లిదండ్రులు చేస్తున్న పనిలో నిమగ్నమై ఉండగా ఆ సమయంలో కత్తితో ఆడుతుండగా కత్తి యొక్క చివరి భాగంగా తన కంటికి తగలడం వల్ల చిన్న వయసులోనే తన చూపును కోల్పోవడం జరిగిందన్నారు. బ్రెయిలీ తన చూపు కోల్పోయిందని నిరాశ పడకుండా తోబుట్టువులతో కలసి పాఠశాలకు వెళ్లి చదువును కొనసాగించారని. స్వర్ణ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం వలన ఈరోజు అంధులు ఉన్నతి స్థితిలో ఉండడానికి ముఖ్య కారణం అన్నారు. అనంతరం బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించారు. విద్యార్థులకి క్రికెట్ కిట్లు ల్యాప్‌టాప్‌లు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి, విద్యార్థులు, వివిధ విసిఎ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు హాజరైయారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను వృథా కానీయొద్దు : ఎంపీ లావు

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను పల్నాడు జిల్లాలో పక్కాగా అమలు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అధికారులను ఆదేశించారు. విభజన తర్వాత నిధుల కొరత ఎదుర్కుంటున్న రాష్ట్రంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు కీలకం అని, వాటి ఫలాలు వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు అందేలా చూడాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నరసరావు పేట పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవరాయలు అధ్యక్షతన నిర్వహించిన దిశా కమిటీ (జిల్లా అభివృద్ధి సమన్వయం మరియు పర్యవేక్షక కమిటీ) సమావేశంలో 37 కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద బాబు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గతంలో నిర్లక్ష్యం కారణంగా ఖేలో ఇండియా లాంటి పథకాల నిధులు వెనక్కి వెళ్లిన పరిస్థితులు మళ్లీ రాకూడదన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ ద్వారా చెంచులకు మంజూరైన 600 వరకూ ఇళ్లను జూన్ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాచర్ల బైపాస్ భూముల సమస్యను ఆర్బిట్రేషన్ ద్వారా పరిష్కారించుకోవాలని సూచించారు.

తాళ్లపల్లిలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-మాచర్ల : మండలంలోని తాళ్లపల్లి, కొత్తూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఏఓ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పంటలకు విచక్షణ రహితంగా పురుగు మందులు వాడితే దిగుబడులు లోపిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అభిషిక్తవర్మ, తాళ్లపల్లి ఉద్యానవన సహాయకులు కరుణానాయక్, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర-వినుకొండ : సం క్రాంతి సందర్భంగా వినుకొండ డిపో నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు జె. నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, 10వ తేదినుండి ఎక్స్‌ప్రెస్ బస్సులు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మొత్తం పది సర్వీసులు పెడతామని అవసరాన్ని బట్టి సర్వీసులు పెంచుతామని ఆయన తెలిపారు.

డైరీలు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వినుకొండ నందు ఎన్ టి ఏ రాష్ట్ర డైరీ మరియు క్యాలెండర్ ను పాఠశాల గజిటెడ్ హెచ్ఎంలు కె.నాగలక్ష్మి మరియు హావీలా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఏ జిల్లా కౌన్సిలర్ సిహెచ్. రమేష్, ఎన్ టి ఏ రాష్ట్ర కౌన్సిలర్ ఊటుకూరి శ్రీకృష్ణ, ఎన్ టి ఏ కార్యవర్గ సభ్యులు రామకోటేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు బి.మారుతి, ఏ. ప్రమీల పాల్గొన్నారు.

ఆత్మకూరులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-దుర్గి : ఆత్మకూరులో మంగళవారం ఏఓ అమీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో సాగు చేసిన మిరప, కంది పంటలను పరిశీలించి, తగు సూచనలు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల ఆఖరికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు ప్రారంభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ దిలీప్ చంద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బెడ్ రిడెన్ రోగుల పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : గ్రామాల్లో అనర్హులు పెన్షన్లు పొందుతున్నారనే అనుమానాలతో ప్రభుత్వం తనిఖీలు ప్రారంభించినట్లు ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా మండలంలో ఈ నెల 18న తనిఖీలు ప్రారంభం కానున్నాయి. మంచానికే పరిమితమై నెలకి రూ.15 వేలు తీసుకుంటున్న పెన్షన్‌దారులను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. దుర్గి మండలంలో 31 పెన్షన్లు ఉన్నాయని, వాటిని 18వ తేదీన తనిఖీల బృందం పరీక్షలు చేసి పరిశీలిస్తుందని వెల్లడించారు. బెడ్ రిడెన్ పేషంట్లు వెరిఫికేషన్‌కు సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర-వినుకొండ : ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ ఆర్టీసీ డి.ఎం జె.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 నుండి 1 గంట వరకు 99592 25431కు ఫిర్యాదులు తెలపాలన్నారు.

ఆరోగ్య పింఛనుదారులు వైద్య బృందానికి సహకరించాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలో ఆరోగ్య పింఛన్లు(బెడ్ రెస్ట్) తీసుకొనే పింఛన్‌దారుల కోసం వైద్య బృందం వస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పప్పుల రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తమ ఇళ్ళ వద్దకే వైద్య బృందం వస్తారని చెప్పారు. కావున రూ.15 వేలు తీసుకునే పింఛనుదారులు ఇంటి వద్దనే ఉండి వైద్య బృందం చేసే పరీక్షలకు సహకరించాలని ఆయన కోరారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

విశాలాంధ్ర-మాచర్ల : అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్దిదారులకు వెంటనే అందించాలని సీపీఐ మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొమెర వీరాస్వామి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాటి చంద్రబాబు ప్రభుత్వంలో టిడ్కో ఇండ్లు 70 శాతం పూర్తయ్యాయని, 2019 తర్వాత మాజీ సీఎం జగన్ వాటిని పూర్తిగా విస్మరించాడన్నారు. తర్వాత 2024 ఎన్నికల ముందు నాటి ప్రతిపక్ష నేతగా నేటి సీఎం చంద్రబాబు తాము అధికారంలోకి రాగానే అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు ఇస్తానన్న హామీ ఏడు నెలలు గడిచినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్ల స్థలాన్ని కేటాయించి, వాటి నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున కేటాయించి, సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవా లని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి టిడ్కో ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలని, లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్స్'-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌ల మధ్య అవగాహన ఒప్పందం



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజ్ఞాన్స్ యూనివర్సిటీ-హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధు కేపీలతో వర్సిటీ వీసీ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఎన్ఈపీ 2020లో పొందుపరిచిన మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్(ఎమ్ఈఆర్‌యూ) కాన్సెప్ట్‌ను, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను, కరిక్యులమ్ డిజైన్‌ను చేస్తామన్నారు. అంతేకాకుండా ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులు, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసేది పత్రికలే

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పత్రికలు చైతన్య దీపికలని జనసేన పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్‌తేజ అన్నారు. విశాలాంధ్ర దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్-2025ను మంగళవారం ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. చరణ్‌తేజ మాట్లాడుతూ విశాలాంధ్ర సమాజం పట్ల గౌరవంతో, ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేస్తుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తుందని చెప్పారు. పత్రికల ద్వారా ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి సమర్థవంతమైన పరిపాలన అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే పత్రికలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. పత్రికల సామాజిక బాధ్యత అసమానమైనదని వివరించారు. సామాజిక బాధ్యత నిర్వర్తించడానికి పత్రికలకు స్వేచ్ఛ అత్యవసరమని, పత్రికలకు స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజల సాధకబాధకాలు తెలపడంతో పాటు ప్రభుత్వం పని విధానాన్ని సమీక్షించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాలాంధ్ర నాదెండ్ల జర్నలిస్టు దివిదాసు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్నదానం నిర్వహించానన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కటారి విష్ణుమూర్తి, జూట్టు ఏడుకొండలు, గండికోట రాజారావు, కోదాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణం అభివృద్ధి

విశాలాంధ్ర-దాచేపల్లి : మాదినపాడు రోడ్డులోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. ఈ పనులను ఎంఈఓ పినాకపాణి, ఉపాధ్యాయులు తగరం ఆనంద్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు. దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చి మొక్కలను తొలగించండి : కమిషనర్

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలోని డ్రైన్స్‌పై రోడ్లపై పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని వినుకొండ మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మంగళవారం వార్డుల్లో పర్యటించారు.

పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పాములకు, పురుగులకు ఆవాసంగా మారి విషపురుగులు రోడ్లపై సంచరిస్తూ ప్రాణ సంకటంగా మారిన నేపథ్యంలో రోడ్ అంచులలో మురుగు కాలువలపై ఎట్టి పరిస్థితుల్లో పిచ్చిమొక్కలు లేకుండా తమ వార్డ్ పరిధులలో పారిశుధ్య కార్మికులు గమనించి తొలగించాలని సంబంధిత అధికారులను మేస్త్రీలను పారిశుధ్య కార్మికులను ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు.

12న ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-కూచిపూడి: సంక్రాంతి వేడుకలలో భాగంగా ఈనెల 12వ తారీకున ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కూచిపూడి శ్రీ సిద్దేంద్ర యోగి నాట్య కళా పీఠంలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొట్టిపాటి సాయి (సినీ నిర్మాత) మంగళ వారం పేర్కొన్నారు. మన సంస్కృతి మన సాంప్రదాయమైన ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రథమ బహుమతిగా రూ.పదివేలు, రెండవ బహుమతిగా రూ.5వేలు, మూడవ బహుమతిగా రూ.2500 నగదు బహుమతులు విజేతలకు పామర్రు శాసన సభ్యులు వర్ల కుమారాజా చేతుల మీదగా అందజేస్తామని, అలాగే పోటీలో పాల్గొన్న మహిళలకు సైతం ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వివరించారు.

సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలి: ఎంపీపీ

విశాలాంధ్ర-వీరులపాడు: ఈనెల 9న జరగబోయే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ మండల పరిషత్ సమావేశాలలో భాగంగా మధ్యాహ్నం రెండు గంటలకు జుజ్జూరు గ్రామంలోని జల్లి ఏసోబు కళ్యాణ మండపం పై అంతస్తులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని, అన్ని శాఖల అధికారులు, జడ్పిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన ఆమె ఒక ప్రకటనలో తెలిపారు

రామకృష్ణకు నేతల పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ: బీజేపీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ ఆర్టీఏ యాక్ట్ కృష్ణా జిల్లా కన్వీనర్ కొండవీటి రామకృష్ణను బీజేపీ, జనసేన నేతలు పరామర్శిం చారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో ఆయన చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వారు వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాజుల శంకర్రావు, కృష్ణాజిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బోగాది చంద్రశేఖర్, మోపిదేవి బిజెపి మాజీ అధ్యక్షులు కామిశెట్టి రమేష్, వీసంశెట్టి సుబ్రహ్మణ్యం, కోడూరు మండల భారతీయ జనతా పార్టీ నేతలు తోట శ్రీనివాసరావు, దేవరకొండ సుబ్బారావు, మింగు శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - ఘంటసాల: సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే చీడ, పీడలు వదిలి అధిక దిగుబడులు సాధిస్తారని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ రైతులకు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన దేవరకోట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వ ర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వ హించారు. మండలంలో రబి సీజన్లో మినుము పంట రైతులు వేస్తారని, వేసిన 21, 24 రోజుల్లో తలుపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడ పీడలు వదిలి దిగుబడి సాధిస్తారన్నారు. బంగారు తీగ ఎక్కువ ఉన్న పొలాల్లో ఇమాటక్సిర్ ఎకరాకు 200 మిల్లీ లీటర్లు తో పిచికారి చేసుకోవాలన్నారు బంగారు తీగ కనిపించిన వెంటనే మొక్కతో సహా పికిలించి తగలబెట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వర్రావు వి ఏ ఏ సత్యదేవ్, రైతులు రైతులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

విశాలాంధ్ర-వీరులపాడు : ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరు వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే లైన్కు స్థల సేకరణలో భాగంగా పెద్దాపురం గ్రామ పరిధిలో పొలాలకు వెళ్లే డొంక దారి రైల్వే లైన్లో కలిసి పోతున్నందున తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని పెద్దాపురం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వలన ఇప్పటివరకు ఉన్న రహదారి పొలాలకు వెళ్లేందుకు వీలులేని కారణంగా ప్రత్యామ్నాయంగా రహదారి సౌకర్యం కల్పించాలని మాజీ జెడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో నందిగామ ఆర్డీవోను గ్రామస్తులు కోరారు. ఆ భూములకు వెళ్లే డొంక రోడ్డు రైల్వే లైన్లో సుమారు 500 మీటర్లు పోతున్న నేప థ్యంలో రహదారి సౌకర్యం కల్పించా లని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో రైతులతో మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రహదారి సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు.

30న పెన్షన్ లబ్ధిదారుల పునః పరిశీలన

విశాలాంధ్ర-కూచిపూడి: మంచానికే పరిమితమైన రోగుల పెన్షన్, దివ్యాంగుల పెన్షన్లలో కొంతమంది అనర్హులు లబ్ధి పొందుతున్నారని భావిస్తున్న ప్రభుత్వం తనిఖీ(పున పరిశీలన)లలోభాగంగా మొవ్వమండలంలో గల 50 మంది పెన్షన్ (నెలకు పదిహేను వేల రూపాయలుచొప్పున) దారు లను ఈనెల 30వతారీఖున ఒకేరోజు మూడు బృందాలు విచారణ నిర్వహించి తనిఖీలు కొనసాగించను న్నారు. ఈ మేరకు ఆయా సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు మంగళవారం లబ్ధిదారులకు రెండవసారి ఎంపిడిఓ సంతకంతో జారీచేసిన ఉత్తర్వులను పెన్షన్ దారులకు పంపిణీ చేసి ఆ రోగులతో పాటు కుటుంబ సభ్యులకు దీనికి సంబంధించిన వివరాలను తెలియపరిచారు. మండలంలో ఈనెల 6 నుంచి 8 వ తారీకు వరకు తనిఖీలు నిర్వహించడానికి తొలుతఆదేశాలుజారీచేసినా ఆఖరినిమిషంలో అనివార్య కారణాలతో వాయిదా వేసి పునః పరిశీలనను ఈనెల 30వతారీకునాడు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయాన్ని ఎండిఓ జే.విమాదేవి సైతం వెల్లడించారు.

కోడిపందేలు, పేకాట కట్టడిపై సమీక్ష

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: సంక్రాంతి పండుగ సందర్భంగా గుడ్లవల్లేరు మండలంలోని కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడ్లవల్లేరు ఎస్ ఐ సాంబశివరావు తెలిపారు. స్థానిక గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఉద్యోగులతో కోడిపందేల నిర్వహించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లవల్లేరు తహసీల్దార్ మాట్లాడుతూ కోడిపందేలను నియంత్రించేందుకు రెవెన్యూ, పంచాయితీ, సచివాలయ ఉద్యోగులు సహకరించాలని తెలిపారు. పందేలు జరుగుతున్నాయని సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెట్టింగ్, పేకాట శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. గత సంవత్సరంలో కోడిపందేలు నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ సారథి మాట్లాడుతూ కోడిపందేల నిర్వహణ నిషేధంపై గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన వాకర్స్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-విజయ వాడ (వన్టౌన్): పాయకాపురంలోని చెరువు పార్క్లో స్పందన వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఇన్ష్టలేషన్ ఆఫీసర్గా డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ అత్తులూరి విజయ లక్ష్మి నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. 23 మంది కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా నియామకం జరిగింది.అధ్యక్షునిగా ఇమ్మానేని కృష్ణప్రసాద్,కార్యదర్శి గా దంతన్ మురళీ,కోశాధికారిగా చెన్నకేశవ తదితరులు ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ఈ ప్రాంత ప్రజలకు వాకర్స్ క్లబ్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలు తెలియ చేస్తూ,సహకరిస్తున్న కమిటీ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ వాకర్స్ కేబినెట్ కార్యదర్శి డాక్టర్ పి. పుష్పాలత, కోశాధికారి బాలాజీ,అడిషనల్ కార్యదర్శి కొండాయ గుంట రాము,అడిషనల్ కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్,డిప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు,తొలుత కళ్యాణం నరసింహ మూర్తి అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పి.భాగ్యలక్ష్మి ,శ్రీ అమరావతి వాకర్స్ అధ్యక్షులు శ్రీ బండారు వేంకటేశ్వర రావు (కొండా),స్థానిక పెద్దలు,వాకర్స్ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో ఎరువుల వాడకం తప్పనిసరి

విశాలాంధ్ర-ఏ కొండూరు: రబి సీజన్లో మొక్కజొన్నలో సాగు చేస్తున్న రైతులు సరైన సమయంలో సరియైన మోతాదులో పైరుకు ఎరువులు అందచేయాలని వ్యవసాయ శాఖ ఏడిఏ జీ కెనడి రైతులకు సూచించారు మంగళ వారం పొలం పిలుస్తుంది కార్యక్ర మంలో భాగంగా కృష్ణారావు పాలెం లో రైతులు సాగు చేస్తున్న మొక్క జొన్నను సందర్శించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్న కంకి నిండా గింజలు ఉండాలంటే మొక్క దశలోనే నత్రజని లోపం లేకుండా అలానే పైరు వేరు వ్యవస్థ సరిగ్గా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ శాఖ అధికారులు సిఫార్సు చేసే మోతాదులో దుక్కిలో భాస్వరం వేయడం అత్యంత అవసరం అన్నారు. అలానే కండెల కాండం బలంగా ఉండాలంటే పోటాష్ ను కూడా అందించాలని జింకు ఇను ము లోపం లేకుండా చూసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు అన్నారు. రబి మొక్కజొన్న పంటకు ఎకరానికి 100 కేజీల నత్రజని 35కేజీల భాస్వరం పొటాష్ 35 కేజీల తో పాటు సూక్ష్మ పోషణ లోపల నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారి చేయాలి అని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ టిప్పు సుల్తాన్ సూచించారు.

వికలాంగ విద్యార్థులకు బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర-గన్న వరం: రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరరావు కుమారుడు వెంకట్ లక్ష్మీ శ్రీనివాస్ 16వ వర్ధంతి సందర్భంగా దావాజి గూడెం స్పందన వికలాంగుల పాఠశాలలో విద్యార్థు లకు స్వీట్స్,బుక్స్, పెన్, పెన్సిల్స్ వగైరా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి పెద్ది వాసుదేవరావు మాట్లాడుతూ వెంకట్ లక్ష్మీ శ్రీనివాస్ మృతి కుటుంబానికి తీరని లోటు అన్నారు. పిల్లలు చిన్నతనంలో ఉండగా భర్తను కోల్పోయిన రజని, కుమారుని కోల్పోయిన ఉమా మహేశ్వరవునోధైర్యంతో మనవడు, మనవరాలును ఉన్నత చదువులు చదివించి తీర్చిదిద్దిన వారిని అభినందిస్తున్నానని అన్నారు. స్పందన వికలాంగుల పాఠశాలను సొంత ఖర్చులతో నడుపుతున్నా ఛైర్మన్ వెంకట్, ప్రిన్సిపల్ రజితను అభినందించారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు వేసి,శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమా మహేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, భార్య ముక్కమాల రజని,క సమార్తె వెంకట సాయి రత్న, కుమారుడు సాయి ప్రకాష్, సిహెచ్ వెంకటేశ్వరవు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీపై దాడులు

విశాలాంధ్ర-విస్సన్న పేట టౌన్: మండలంలో ఎక్సైజుశాఖ నాటు సారా తయారీ, విక్ర యాలపై దాడులు నిర్వ హించింది. మండల కేంద్రమైన విస్సన్నపేట శివారు రాజీవ్నగర్తోపాటు మండలంలోని తాతకుంట్ల, చంద్రుపట్ల, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో ఈ దాడులు కొనసాగించామని తిరువూరు ఎక్సైజు సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, వేమిరెడ్డిపల్లి తండాలో ఒక సారా బట్టీని గుర్తించి సుమారు 400 బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. విస్సన్నపేట రాజీవ్నగర్ సమీపంలోని తెలికలకుంట వద్ద మరో నాటుసారా బట్టీని గుర్తించి, సుమారు 600లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ బట్టీల సామాగ్రిని స్వాధీనం చేసుకుని, విచారణ చేస్తున్నామన్నారు.

బాలికతో రిక్షా పుల్లర్ అసభ్య ప్రవర్తన

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: బాలికతో రిక్షా పుల్లర్ అసభ్య ప్రవర్తన చేశాడు. కొత్తపేటకు చెందిన బాలిక స్థానిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి హాస్పటల్కు వెళ్లింది. ఈక్రమంలో బాలిక ఇంటికి వెళ్లుతుండగా ఓ రిక్షా పుల్లర్ నేను మీ ఇంటికి వెళుతున్నానని చెప్పి బాలికను ఎక్కించుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతేకాకుండా బాలికను బలవంతంగా తన ఇంటికి తీసుకుని వెళ్లాడు. రిక్షాలో తీసుకెళ్లడం కొంత మంది చూసి వెంటనే బాలికను కాపాడారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రిక్షా పుల్లర్ బాలస్వామి పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కొండలరావు తెలిపారు.

చిన్న సమస్యా పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రతి చిన్న సమస్యనైనా పరిష్కరించే దిశగా అధికారులు ప్రతి బోర్డులో సమీక్ష సమావేశం నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ మంగళవారం గుణదల్లో 1వ వార్డు సచివాలయం, వార్డు స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎంహెచ్వో డా.రామకోటేశ్వరరావు, ఇన్చార్జి ఎస్ఈ శ్రీనివాసరావు, ఏసీపీ రాంబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గులు తెలుగు సంస్కృతికి ప్రతీకలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: సంక్రాంతి ముగ్గులు తెలుగు సంస్కృతికి ప్రతీకలు అని నియోజకవర్గ యువనాయకులు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ సతీమణి మండలి సాయి సుప్రియ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని ఎస్.వీ.ఎల్ క్రాంతి కళాశాలలో సంక్రాంతి పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులను మండలి సాయి సుప్రియ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ తిలకించి అభినందించారు. సంక్రాంతి సాంప్రదాయాలను నేటి విద్యార్థులకు మరింత చేరువ చేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమాన్ని ఎస్.వీ.ఎల్ క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు దుట్టా వెంకట వసుమతి, ప్రిన్సిపాల్ ఎన్.వీ. నాగేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

పంట కాలువల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-అవనిగడ్డ: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో పంట కాలువల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అశ్వారావు పాలెం నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం సాగునీటి సంఘం పరిధిలోని సిద్దయ్యకోడు, రెండో నెంబర్ పంట కాలువల్లో ఇరిగేషన్ శాఖ నిధులతో తూటికాడ నిర్మూలనకు స్ప్రేయింగ్ చేయించారు. అశ్వారావుపాలెం, బందలాయి చెరువు, గుడివాక వారిపాలెం ఆయకట్టు రైతులకు మేలు చేసేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ ఏఈ రవితేజ, నీటి సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనలో లోపాలను సరిచేయాలని వినతి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ కుల గణనలో జరుగుతున్న లోపాలను సరిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా కు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్‌గా ఏకసభ్య కమిషన్ ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ కేటగిరి కుల గణన అన్ని జిల్లాలలో జరుగుతుంది. ప్రతి జిల్లాలో కొన్ని సచివాలయాల్లో మాదిగల జనాభా శాతాన్ని తగ్గించి చూపే కోణంలో జరుగుతున్న కొన్ని లోపాలను మందకృష్ణ మాదిగ గుర్తించి గత డిసెంబర్ 31న గుంటూరులో రాజీవ్ రంజన్ మిశ్రా దృష్టికి ఆధారాలతో తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రధానంగా 70 సం.లు పైగా హిందూ మాదిగలుగా ఉన్న వారిని ఒక్కసారిగా క్రిస్టియన్ మాదిగలుగాలి మార్చి రాశారు. మాదిగల పక్కన రిలీజియన్ ఏమీ మెన్షన్ చేయకుండా ఖాళీగా ఉంచారు. కొన్ని తరాలుగా ఉన్న మాదిగ ఇంటిపేర్లు ఇతర కులం వారి ఇంటిపేరుగా చూపించి మాదిగ జనాభాని కూడా వారి జనాభాగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కలెక్టర్‌ను కలిసిన వారిలో మంద వెంకటేశ్వరరావు మాదిగ కోట దానియేలు, లింగాల నర్సింహులు, దేవులూరి టోని, కాంపాటి వెంకటేశ్వరరావు, నూక పోగు ఏసు, మామిడి రాంబాబు, ఇసుకపల్లి చంటి, కటికల సైదులు, జనార్దన్, శ్రీనివాస్ ఉన్నారన్నారు.

అట్టడుగు ప్రజలకు పవన్ కళ్యాణ్ తోడ్పాటు: మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: అట్టడుగు ప్రజానీకం గురించి ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నాగాయలంక మండలం పర్రచివర శివారు దీనదయాళపురం గ్రామానికి చెందిన 30 మంది మత్స్యకారులు జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తీర ప్రాంత గ్రామాల నుంచి మత్స్యకారులు జనసేన పార్టీలో చేరటం ఆనందదాయకం అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని అట్టడుగు వర్గాల కష్టనష్టాలు తీర్చేందుకు అందరూ కలిసి పని చేస్తామన్నారు. దివిసీమ ఉప్పెన అనంతరం ఆర్ఎస్ఎస్ వారు దీనదయాళపురం గ్రామాన్ని పునర్నిర్మించి ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసి అప్పటి విదేశాంగ శాఖ మంత్రి వాజ్ పాయ్ చేతులమీదుగా ప్రారంభించారని తెలిపారు. ఆ సమయంలోనే పటిష్టమైన తుఫాన్ షెల్టర్ కూడా నిర్మించారన్నారు. దీనదయాళపురం గ్రామాన్ని మరోసారి సమగ్ర అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, నాగాయలంక మండల పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కొక్కిలిగడ్డ మస్తాన్ రావు, రామాణి మాణిక్యాలరావు, కొక్కిలిగడ్డ పోతురాజు, కోలా బ్రహ్మం, వనమాల నరసింహారావు, నడకుదుటి తాతయ్య, రాసాని వెంకటేశ్వరరావు, నాగిడి వెంగయ్య, నడకుదుటి సాయితో పాటు 30 మంది జనసేన పార్టీలో చేరారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్థానిక నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ వీఎంసీ యూనిట్ క్యాలెండర్‌ను కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ వీఎంసీ యూనిట్ అధ్యక్షులు శ్యామ్ సుందర బాబు, కార్యవర్గ సభ్యులు కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒకే క్యాడర్‌లో ఉద్యోగులు పదోన్నతులు లేకుండా పని చేస్తున్న వారికి పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులు విధి నిర్వహణలో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివరామప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు, వీఎంసీ యూనిట్ జనరల్ సెక్రటరి సలీం అహ్మద్, ఉపాధ్యక్షులు రాంబాబు, అసోసియేట్ ప్రెసి డెంట్ ప్రకాష్‌సాగర్, ఆర్గనైజింగ్ సెక్రెటరి సురేంద్రకుమార్, పబ్లిసిటీ సెక్రటరి మారుతీరావు, ట్రెజరర్ ఉదయభాస్కర్, ఉపాధ్యక్షులు శారదారాణి, వెంకటేశ్వరరావు, జయప్రభు, మూర్తి, సెక్రెటరీలు మధుసూదనరావు, శుభకరరావు, కరుణ, జాయింట్ సెక్రెటరీస్ అహమ్మద్ అలీ, రాజశేఖర్, భాస్కరరావు, దీపక్‌కుమార్, సీత, అరుణ, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ షర్మిల, పద్మశ్రీ, శ్యామ్యూల్, దుర్గారావు, రవి పాల్గొన్నారు.

డాన్‌బాస్కో వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: డాన్‌బాస్కో స్కూల్ 42వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. నగరంలోని గురునానక్ నగర్‌లో గల స్కూల్ ప్రాంగణంలో మంగళ వారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ మాట్లాడుతూ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ సంవత్సరం సిబిఎస్ఈ గుర్తింపు లభించడం ఇంగ్లీషు మీడియంలో స్కూల్‌లో కూడా మాతృభాష తెలుగును బోధించడం అభినందనీయమన్నారు. తొలుత చిన్నారులు, విద్యార్థులు నిర్వహించిన ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యస్‌కెపివివి విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వి నారాయణరావు, స్కూల్ కరస్పాండెంట్ బివి యస్ ప్రసాద్ , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటు పైలట్ ప్రాజెక్ట్‌కు జిల్లాకోక మండలం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటుకి సంబంధించి రూరల్ ఏరియాలో ఒక నూతన ప్రక్రియకి కార్యాచరణ. పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రతి జిల్లాలో ఒక మండలం ఎంపిక చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుంచి వచ్చిన డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్స్‌తో స్వచ్ఛాంధ్ర స్టేట్ లెవెల్ రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏదైనా గ్రామంలోకి ప్రవేశించగానే ఆ ఊరి పేరుకి బదులు అక్కడున్న చెత్త మనకు స్వాగతం పలుకుతుందని ఇక నుంచి ఆ పద్ధతికి ముగింపు చెప్పాలన్నారు. ప్రభుత్వం స్వచ్ఛాంధ్రకి ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కూడా స్వచ్ఛాంధ్రపై ఎంత శ్రద్ధ, ఫోకస్ ఉంచారో ఇప్పటికే మీరు కూడా వినే ఉంటారన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా 10 ముఖ్యమైన సూత్రాలలో స్వచ్ఛాంధ్రకి కూడా స్థానం కల్పించారన్న విషయాన్నీకూడా గుర్తుపెట్టుకోవాలని, అంతేకాకుండా ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా ప్రకటించి ఆ రోజున ప్రభుత్వ యంత్రాంగం మొత్తం దృష్టి పెట్టె విధంగా ఒక దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో శానిటేషన్ కానీ అలాగే సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ని ఏ విధంగా గాలికి వదిలేసారో మనందరికీ తెలుసనీ దానికి పూర్తి విరుద్దంగా సత్ఫలితాలు వచ్చే విధంగా ఈ ప్రభుత్వం పని చేయబోతోందన్నారు. దేశం లోనే మొట్టమొదటి సారిగా గతంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు క్లీన్ అండ్ గ్రీన్ ఇన్షియేటివ్‌ని ప్రారంభించి పచ్చదనం పరిశుభ్రత యొక్క ఆవశ్యకతని ఉమ్మడి రాష్ట్రాల ప్రజలకి తెలియ చెప్పారన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ అటవీశాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో ఇప్పటికే భేటీ అవడం జరిగిందని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటుకి సంబంధించి రురల్ ఏరియాలో ఒక నూతన ప్రక్రియకి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని దాని వివరాలు కూడా అతి త్వరలో చేస్తామని తెలిపారు.

స్విడ్ గేమ్ సీజన్ 2తో సీగ్రమ్స్ రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సీగ్రమ్స్ రాయల్ స్టాగ్, ప్రేక్షక అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నెట్‌ఫ్లిక్స్ వారి రికార్డ్ బ్రేకింగ్ సిరీస్ 'స్విడ్ గేమ్' రెండవ సీజన్ కోసం కొలాబరేట్ చేసింది. ఈ కొలాబరేషన్, రాయల్ స్టాగ్ వారి 'లివ్ ఇట్ లార్జ్' సిద్ధాంతాన్ని సునాయాసంగా మేళవించి, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమందిని సమ్మోహితులను చేసిన అంతర్జాతీయ గ్లోబల్ కల్చరల్ ఒరవడిలో ప్రేక్షకులకు ఒక లార్జర్ దాన్ లైఫ్ అనుభవాన్ని అందించింది. ఈ కొలాబరేషన్‌ను గురించి పెర్నాడ్ రికార్డ్ ఇండియా మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జోయ్‌దీప్ బసూరాయ్ మాట్లాడుతూ, స్విడ్ గేమ్‌తో ఈ భాగస్వామ్యం మన ప్రేక్షకులకు, యావత్తు జనరేషన్‌కు లివ్ ఇట్ లార్జ్ అనుభవం, అనుభవైకమైన సామాజిక కరెన్సీని ఆఫర్ చేసేందుకు వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

బేయర్ ఏజి నుండి ఇథోక్సిసల్ఫ్యూరాన్ అస్సెట్స్ కొనుగోలు చేసిన క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వ్యవసాయ ఆవిష్కరణలలో అగ్రగామిగా ఉన్న క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్, కొన్ని ఆసియా దేశాలలో విక్రయాల కోసం బేయర్ ఏజి నుండి క్రియాశీల పదార్థం ఇథోక్సిసల్ఫ్యూరాన్ యొక్క గ్లోబల్ కొనుగోలును ప్రకటించింది. ఈ సముపార్జన క్రిస్టల్ యొక్క 13వ వ్యూహాత్మక లావాదేవీగా, 2021లో ఇండియన్ కాటన్, పెరల్ మిల్లెట్, మస్టర్డ్ సీడ్ పోర్ట్‌ఫోలియోను కొనుగోలు చేసిన తర్వాత బేయర్ నుండి రెండవ కొనుగోలుగా గుర్తించబడింది. వరి కలుపునాశిని మార్కెట్లో క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నాయకత్వానికి మద్దతునిస్తూనే తమ ఈబీఐటీడీఏను 20 శాతం పెంచుతుంది. ఎథోక్సిసల్ఫ్యూరాన్ వరి, తృణధాన్యాల పంటలలో విస్తృత ఆకు జాతి కలుపు మొక్కలు, తుంగను సమర్థవంతంగా నియంత్రించడంలో ప్రసిద్ధి చెందింది. ఈ కొనుగోలు గురించి క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అంకుర్ అగర్వాల్ మాట్లాడుతూ, అధునాతన కలుపు నిర్వహణ పరిష్కారాలతో రైతులను బలోపేతం చేయడంలో ఒక అడుగు ముందుకు వేశామని అన్నారు.

లయన్స్‌గేట్ ప్లేతో వి భాగస్వామ్య ఒప్పందం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి, ప్రీమియం స్ట్రీమింగ్ సర్వీస్, లయన్స్‌గేట్ ప్లేతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. దీనితో, అత్యుత్తమ కంటెంట్ తో కూడిన ప్రత్యేక లైబ్రరీని వినియోగించే అవకాశం వినియోగదారులకు కలుగుతుంది. యాక్షన్ బ్లాక్‌బస్టర్‌లు, ఐకానిక్ ఫ్రాంచైజీలు, ప్రశంసలు పొందిన చలనచిత్రాలు, సిరీస్‌లు, గ్లోబల్ అవార్డులు, ప్రత్యేకమైన ప్రీమియర్లు, డబ్బింగ్ కంటెంట్ యొక్క శ్రేణిని కలిగి ఉన్న లయన్స్‌గేట్ ప్లే సాటిలేని వినోద అనుభవాన్ని అందిస్తుంది. ఈ భాగస్వామ్యంతో వి యొక్క ఓటిటి పోర్ట్‌ఫోలియో మరింత విస్తరిస్తుంది. ప్రీమియం, విభిన్నమైన హాలీవుడ్ సినిమాల లైబ్రరీ, ఒరిజినల్ సిరీస్, అంతర్జాతీయ శీర్షికలు, మరిన్నింటిని సరసమైన ధరకు అందిస్తుంది.

లయన్స్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం



విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారని గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్ బొప్పన శివప్రసాద్, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక వితరణతో మండలంలోని పెంజెండ్ర గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 62 పశువులకు 30 గొర్రెలకు పశు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రూ.10 వేల విలువగల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, లయన్స్ సభ్యులు సూరపనేని పరంధామయ్య, రైతులు పాల్గొన్నారు.

12న చినముత్తేవిలో ముగ్గులపోటీలు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం చినముత్తేవి జిల్లా పరిషత్ హైస్కూల్లో సంక్రాంతి వేడుకలలో భాగంగా ఈనెల 12వ తారీఖున ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వ ర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

1981-82 విద్యా సంవత్సరం 10వ సంవత్సరం విద్యార్థులలోపోతుల చిట్టిబాబు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు,తాటిపర్తి ముక్తే శ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను మధ్యాహ్నం మూడు గంటలకి ప్రారంభిస్తామని విజేతకు బహుమ తులు అందజేస్తామని వివరిస్తూ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొంటారని ప్రకటించారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోటీలు

ఈ నెల 14న మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొవ్వ మండలం చినముత్తేవిలో, జనవరి 15వతారీఖున మొవ్వ మండలంలోనిఅవురుపూడిలోప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలుతోపాటు యువతకు కుర్చీలాట, స్లోసైక్లింగ్, పరుగుపందెం, తదితర అంశాలలో పోటీలునిర్వహించి విజేతలకు బహుమతులు అందచేస్తూన్నామని కృష్ణా జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆ గ్రామాలలోనే ప్రజాసంఘాలవద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని వివరించారు.

పెన్షనర్ల ఆకాంక్షల సాకారానికి కృషి: ఏపీఎన్జీవో

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ కార్మిక వర్గాలు, పెన్షనర్లు ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను చక్కదిద్దేందుకు ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘం చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తుందని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అలపర్తి విద్యాసాగర్‌కు ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ లోని ఎన్జీవో హోమ్‌లో ఆత్మీయ సత్కారాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కేవీ శివారెడ్డి మాట్లాడుతూ విద్యాసాగర్ వంటి వ్యక్తులు రాష్ట్రస్థాయి పదవులలో ఉండటం ఏపీఎన్జీవోలో ఉన్న ప్రతిఒక్కరికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇటీవల తాము ప్రభుత్వ పెద్దలను కలిసిన సమయంలో ఉద్యోగ కార్మిక పెన్షనర్లు, ఉపాధ్యాయుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర నాయకత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పెన్షనర్ల ప్రధాన డిమాండ్ అయిన అడిషనల్ క్వాంటం విధానాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టడం జరిగిందని, అయితే గత ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని, ఇప్పుడు మళ్లీ సీఎంగా చంద్రబాబు వచ్చిన నేపథ్యంలో ఈ సమస్య త్వరలో పరిష్కారమవుతుందని

ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మాన గ్రహీత అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎంతో విలువైన కాలాన్ని మూడు దశాబ్దాల పైబడి ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో సేవలు అందించి పదవి విరమణ పొందిన పెన్షనర్ల ఆకాంక్షలు నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తమ ఇంట్లో కూడా పెన్షనర్లు ఉన్నారన్నారని వారి సమస్యలను పెన్షనర్ల సంఘం నాయకుల కంటే ముందే తన ఇంట్లో ఉన్నవారే తమను ప్రశ్నిస్తారన్నారు. గత ఐదేళ్లుగా ఉద్యోగులతో పాటు పెన్షనర్లు కూడా నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో తగ్గించిన క్వాంటం పెన్షన్ అంశంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు మంత్రులు, అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకు వెళ్ళామన్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రభుత్వ పెద్దలు కొంత సమయం అడిగారని వివరించారు. తాము కూడా తమ సమస్యలన్నీ ఒకేసారి పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరబోవడం లేదన్నారు. అత్యవసరంగా పరిష్కరించాల్సిన డీఏ, హెల్త్ కార్డు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ వంటి అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలను కోరినట్లు పేర్కొన్నారు. తాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి ప్రధాన భూమిక పోషించారన్నారు. నాయకత్వం అనేది బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని పాత తరం నాయకుల నుంచి తెలుసుకొని అందుకు అనుగుణంగా తనను తాను మానసికంగా సిద్ధం చేసుకున్నానన్నారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షులు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యాసాగర్ వంటి నాయకులు అరుదుగా ఉంటారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ ఎన్నిక అయిన తర్వాత పెన్షనర్లు ధైర్యం వచ్చింద న్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన అత్యవసరమైన అంశాలలో శివారెడ్డి, విద్యాసాగర్ ద్వయం నాయకత్వంలో వేగంగా పరిష్కారం అవుతాయని పెన్షనర్లు భావిస్తున్నారని వివరించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు బీవీ సుబ్బయ్య, ఉపాధ్యక్షులు అబ్దుల్ కరీం, ఎన్టీఆర్ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.దాలినాయుడు, నారాయణరావు, జి.ప్రభుదాసు,బి.విష్ణువర్ధన్ రావు, ఏపీ ఎన్జీవో రాష్ట్ర కోశాధికారి రంగారావు, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి, సిటీ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, వివిధ జిల్లాలకు చెందిన పెన్షనర్ల అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులు,పెన్షనర్లు పాల్గొన్నారు.

నా కుమారుడి మృతిపై విచారణ చేయించండి: బాధితురాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వికలాంగుడైన తన కుమారుడిని కోడలు ఆమె ప్రియుడు కలిసి హతమార్చారని, దానిని సత్యనారాయణపురం పోలీసుల సహకారంతో కేసును తప్పుదోవ పట్టించారని ఒక మహిళ ఆరోపించింది.

తన కోడలు ఆమె ప్రియుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని అమె నగర పోలీస్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం గాంధీనగర్‌లోని సత్యనారాయణపురం పోలీసుస్టేషన్ సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూ రైల్వేలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న నిదానపు సాయికుమార్, భార్య శ్యామలతో కలిసి సత్యనారాయణపురం రైల్వే క్వార్టర్స్‌లో జీవనం సాగిస్తున్నారు. గత నవంబర్ 17న సాయికుమార్ ఊపిరాడక మృతి చెందాడని ఆయన భార్య శ్యామల సాయి కుమార్ అమ్మ, అక్కకు సమాచారం ఇచ్చింది. కుమారుడు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ సాయి కుమార్ తల్లి నిదానపు వసుంధర పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అయితే తన కోడలు అమె ప్రియుడు సొలం స్నైలాబ్‌ను పోలీసులు ఏ విధమైన విచారణ చేయకుండానే వదిలేశారని ఫోన్లు కూడా ఆమెకు ఇచ్చేశారని తల్లి ఆరోపించింది. ఆ ఫోన్లో కాల్ రికార్డింగ్స్, వీడియోలు ఉన్నాయని ఆ ఫోన్ నిందితురాలికి ఏ విధంగా ఇస్తారని సాయికుమార్ తల్లి ప్రశ్నించింది.భార్య, అమె ప్రియుడు నుంచి తనకు ప్రాణహాని ఉందని పలుసార్లు తన కుమారుడు తనకు చెప్పాడని,భార్య ప్రియుడు సొలం స్నైలాబ్ తన కుమారుడిపై ఒకసారి దాడి కూడా చేశాడని, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో తన కుమారుడు దాడి ఘటనపై ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు.తన కుమారుడి శవ పంచనామా రిపోర్టుల్లో సాక్షి ఉన్నాడని రాశారు తప్ప ఆ సాక్షి పేరు రాయలేదని,ఇంటి అడ్రస్ కూడా పోలీసులు తప్పుగా నమోదు చేశారని ఇదేమని ప్రశ్నించిన తమపైనే ఎదురు కేసులు పెడతామని బెదిరించారని అమె ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులు ఈ కేసును తప్పుదోవ పట్టించి నీరుగాచే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించింది. సత్యనారాయణపురం పోలీసుల విచారణపై తమకు నమ్మకం లేదని పోలీస్ కమిషనర్ స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

అపార్థానికి గురైన కవి బైరాగి: యార్లగడ్డ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజలకు అర్థమయినదానికన్నా అపార్థానికి గురైన కవి ఆలూరి బైరాగి అని సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. ఆయనను సరిగ్గా అర్థంచేసుకోక నిరాశావాది, అరాచకవాది అని చిత్రీకరించారన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం ప్రధాన వేదిక మీద మొదటి కార్యక్రమంగా కవి ఆలూరి బైరాగి శతజయంతి సభ నిర్వహించారు. దానిలో ప్రధానవక్తగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ కవిత్వాన్నే శ్వాసగా జీవించిన బైరాగి తనదైన వ్యక్తీకరణ, పదవిన్యాసంతోబాటు చిక్కనైన మానవత్వ భావాలూ, సామాజిక స్పృహతో తెలుగు సాహితీ ప్రేమికుల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. సభకు బండ్ల మాధవరావు అధ్యక్షత వహించారు.

హక్కుల ఉద్యమకారుడు సాయిబాబా

హక్కుల ఉద్యమకారుడిగా సాయిబాబా ప్రజాస్వామ్య విలువలను నమ్మే వారందరికీ ఆదర్శప్రాయుడని ఆయన సహచరి ఎ. ఎస్. వసంతకుమారి అన్నారు. విజయవాడ పుస్తకమహోత్సవంలో జరిగిన కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం వారు ప్రచురించిన అరుణతార ప్రత్యేక సంచిక 'ప్రపంచ విప్లవ మానవుడు సాయిబాబా'ను సాయి బాల మిత్రుడు కేఎంఆర్ ప్రసాద్ ఆవిష్కరించారు. సాయిబాబా స్ఫూర్తి కవిత్వం నిండిన 'నువ్వెళ్లిన దారిలో' సాయి సహచరి ఏఎస్ వసంతకుమారి ఆవిష్కరించారు. కవితాసంచిక సంపాదకురాలు వైష్ణవిశ్రీ, శ్రీరాం, అరసవిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథకు జాతీయ స్థాయి కల్పించిన ఘనత నాజర్‌దే తెలుగులో బుర్రకథకు ఒక ప్రామాణిక రూపం కల్పించి, పండిత పామరులకు ఆమోదయోగ్యంగా, ఆస్వాదనీయంగా తీర్చిదిద్దిన ఘనత షేక్ నాజర్‌దేనని ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య అన్నారు. పధాన వేదికపై బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ శతజయంతి సభ నిర్వహించారు. దానిలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆయన

నాజర్‌ను కేవలం బుర్రకథ పితామహుడిగా గుర్తుపెట్టుకుంటే ఆయన కృషికి అన్యాయం చేసినట్లేనన్నారు. తెలుగులో ప్రజాపాటకు, అభ్యుదయ గీతాలకు మూలపురుషుడన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఖాదర్ మొహియుద్దీన్ సినీవిమర్శకుడు రంగావఝల భరద్వాజ ప్రముఖ పత్రికా సంపాదకులు కె. శ్రీనివాస్, నాజర్ కుమారుడు బాపూజీ ప్రసంగించారు. సాహితీ ప్రవంతి బాధ్యులు వొర ప్రసాద్, బుక్ ఫెస్టివల్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, కార్యదర్శి టి.మనోహర్ నాయుడు తదితరులు సభలో పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAHEENA PARVEEN SAYYAD (Old Name) W/o. Shaik Iqbal Ahamed, R/o. D.No. 76-37-179/5, Old MIG 179/F5 APHB Colony, Opp: Police Station, Bhavanipuram, Vijayawada - 520012, A.P. I have changed my name from SHAHEENA PARVEEN SAYYAD to SHAIK SHAHEEN (New Name) W/o. Shaik Iqbal Ahamed. Hereafter she will be called as SHAIK SHAHEEN W/o. Shaik Iqbal Ahamed.

CHANGE OF NAME

I, POTHINA RAMANAMMA (old Name), W/o. Pothina Tata Rao, R/o. D.No. 3-1-229/6C, Rajugari Flats, Midhula Nagar, Kabela, Vijayawada-12. NTR Dist., A.P. I, declare that I, have changed my name as POTHINA RAVANAMMA (New Name). So, here after my name is known as POTHINA RAVANAMMA.

7వ రోజు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలకు ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి వారు 600 మంది పురుష అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించడం జరిగిందని, మంగళవారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలను కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ పరీక్షలకు హాజరైన అభ్యర్థులతో స్వయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై మరియు ఈవెంట్స్‌కు చేసిన ప్రిపరేషన్‌పై ఆరా తీసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు



చాలామంది అధిక ఒత్తిడి, ఎండవలన వారి శరీరం డీహైడ్రేషన్‌కు గురై కళ్ళు తిరిగే పడిపోవడం జరుగుతుంది కనుక ఎవరికి అలాంటి స్థితి కలుగకుండా ప్రత్యేక ఆలోచనతో, చొరవతో కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్, గ్లూకోస్ వంటి హెల్త్ డ్రింక్స్, చక్కెరకేళి, అరటి పండ్లు అందుబాటులో ఉండేవిధంగా స్టాల్ ను ఏర్పాటు చేశారు. అదే విధంగా లాంగ్ జంప్, చేసే సమయంలో పాటించవలసిన టెక్నిక్స్ గురించి అభ్యర్థులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 600 మంది అభ్యర్థులకు గాను మంగళవారం 284 మంది అభ్యర్థులు బయోమెట్రిక్ కు హాజరయ్యారని, వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు అనగా 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 284 మంది అభ్యర్థుల్లో 184 మంది మెయిన్స్ కొరకు అర్హత సాధించగా 100 మంది అభ్యర్థులు డిస్ క్వాలిఫై అయ్యారు.

ప్రకటన

A.P. కార్మిక సంక్షేమ మండలి వారు 21-22, 22-23 & 23-24 సం॥లకు ఆడిట్ చేయుటకు ఆడిట్ ఫర్మ్‌లను కొటేషన్‌లు జనవరి 10 2025 మధ్యాన్నం 3.00 లోగా ఇవ్వవలసిందిగా కోరుచున్నాము. ఇట్లు

సంక్షేమ కమీషనర్

దావా సమను

మహారాజశ్రీ జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O. S. No.23/2021

Between:-

పేరం లక్ష్మి @ లక్ష్మమ్మ - వాది

మరియు

ముక్కపాటి సుబ్బారావు - ప్రతివాది

To

ప్రతివాది

ముక్కపాటి సుబ్బారావు, S/o. జానకి రామయ్య, గోపినేనిపాలెం గ్రామం, వత్సవాయి మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా.

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదిపై దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో ప్రతివాది అయిన మీరు మీ హాజరు నిమిత్తం ది.09-01-2025 ఉదయం 10.30 గంటలకు శ్రీ కోర్టువారి ఎదుట మీరుకానీ, మీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోలరు. లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించేదరు.

వాయిదా తేది. 09-01-2025

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

శ్యామల నరసింహా రెడ్డి,
రావూరి వీర లక్ష్మీనారాయణ,
న్యాయవాదులు, జగ్గయ్యపేట-521175
9848146477, 9848326243
జగ్గయ్యపేట, తేది : 07-01-2025

రైల్వే శాఖపై చర్చించిన ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : ముంబైలో మంగళవారం జరిగిన పబ్లిక్ కమిటీ సమీక్ష సమావేశంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైల్వే శాఖ విషయాలను గురించి చర్చించారు. ఈ సమావే శంలో రైల్వే ఉన్నతాధికారులు ఎంపీని సత్కరించారు.

ఎస్సీ కులగణనపై 12వరకు అభ్యంతరాల స్వీకరణ: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 7వ తేదీతో గడువు ముగియనుండటంతో మరో మూడు రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎస్ఓపీ విదివిదానాలు తెలపుతూ ప్రభుత్వం 265 నంబరు జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబందిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబందిత ప్రక్రియను పూర్తి స్తాయిలో పర్యవేక్షించాలని ప్రకటన ద్వారా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఆదేశించారు.

దేవదాయ కమిషనర్‌పై ఆరోపణలు నిరాధారం

విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనరు శ్రీ రాము సత్యనారాయణపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని ఏపీ ఎండోమెంట్ ఇన్సిట్యూషన్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కోగంటి రవి కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కొటికలపూడి హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. మచ్చలేని చంద్రుడిలా నిబద్ధతతో పనిచేస్తూ, ఆపదలో అండగా ఉంటూ, అందరికీ సమ న్యాయం చేస్తూ, ఆయన సేవల ద్వారా ఈ శాఖ కీర్తిని నలుదిశలా వ్యాపింపజేస్తున్నారన్నారు. అలాంటి వారిపై నిరాధార ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. ఇకపై ఇలాంటి అవాస్తవకథనాలు, అసత్య కదనాలు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ప్రచారాలు చేసే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు తెలియజేసారు.

ప్రేమకి పరాకాష్ఠ జనరంజకం నాటిక



విశాలాంధ్ర-విజయవాడ రూరల్: ప్రేమకి పరాకాష్టగా జనరంజకం నాటిక నిలిచిందని ప్రముఖ కళాకారుడు, ఆంధ్రప్రదేశ్ నటీనట నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్త అన్నారు. శ్రీ ధర రాధా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా వారి వేదికపైన జీవీఎన్ఎస్ వరప్రసాద్ సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. నాటికలను ప్రభుత్వం వారు దాతలు ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు దర్శకుడు మాడుగుల కృష్ణమోహన్‌ని గుప్తా శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ నాటికలో మనుప్రియ, ఐరేని రమేష్ గౌడ్, వారి పాత్రలకు న్యాయం చేకూర్చారు.

గిరిజనులకు అటవీహక్కు పట్టాలు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర-విజయవాడ: దశాబ్ధాల తరబడి అటవీభూములను అనుభవిస్తున్న గిరిజన పేదలకు చట్ట ప్రకారం హక్కు పట్టాలు ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ కోరారు. తాడేపల్లి గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదపై ఆధారపడి ఎన్నో తరాలుగా గిరిజనులు ఇతర పేదలు జీవన కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన వన సంపరక్షణ సమితిలో భాగస్వాములై ఉన్నప్పటికీ 2006లో వచ్చిన చట్ట ప్రకారం పట్టాలు ఇవ్వడంలో అన్యాయం చేయడం దారుణమన్నారు. గతంలో 11మంది గిరిజనులకు పట్టాలు ఇచ్చి మిగతా 100 మంది కి పైగా ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా చట్ట పరిధిలో పట్టాలు ఇవ్వాలని లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత గిరిజనులు, పేదలు పట్టాలు ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేసి సమస్యను అధికారులకు వివరించారు. సమస్యను పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలం సీపీఐ కార్యదర్శి ఉప్పెన నరసింహ రావు, గ్రామ కార్యదర్శి దేశ్య నాయక్, కె లక్ష్మయ్య, ఎల్ తిరుపతమ్మ, కె భవానీ, జ్యోతి తదిరులతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచాలని నిరసన

విశాలాంధ్ర-పెడన : గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులు కేవలం రూ.3వేల వేతనంతో పనిచేస్తున్నారు. ఇవి కూడా మూడు నాలుగు నెలలకు ఇస్తున్నారు. ఇది టీ, టిఫిన్లకు కూడా సరిపోవడం లేదు. కనుక విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి పదివేల రూపాయలు వేతనం అందించాలని ఏఐటీయూసీ నాయకుడు కట్టా హేమ సుందర రావు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పెంచాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేస్తూ వీరికి సంబంధించిన పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థికి 30 రూపాయలు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

మండల ప్రెసిడెంట్ రాజా రత్నం మాట్లాడుతూ వర్కర్లకు పదివేల రూపాయలు వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వారు పడే ఇబ్బందులను ఏ కరువు పెట్టారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీని ప్రకారం మెనూ చార్జీలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎండీ రఫీవుల్లాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ కట్టా రాజకుమారి, బూసం. బాలసుబ్రమణ్యం, వీరాస్వామి, ధనలక్ష్మి, బేగం, ఏజెన్సీలు హెల్పర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

పేదలకు ఇళ్ల పేరుతో రూ.3.50కోట్లు దోపిడీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: గత వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పేరుతో తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో దేవస్థానం భూములను నిబంధనలకు విరుద్ధంగా తీసుకొని దేవస్థానంకు చెందాల్సిన రూ.3.50 కోట్లు కొట్టేశారని, దీనివెనుక ఉన్న దోపిడీదారులు వారికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని దేవాలయాల భూములను కాపాడాలని బీజేపీ నాయకుడు వై.కామేశ్వరరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజావినతుల స్వీకరణలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లకు అర్జీ అందజేశారు. ప్రకాశం జిల్లా సీపీపల్లె మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన వేమూరి సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని చెరువు ఆనకట్ట, తూములు పూర్తిగా పాడైయ్యాయని అంతే కాకుండా ప్రధాన కాలువ పూడిపోవడంతో చెరువులోకి రావాల్సిన నీరు రావడంలేదని, నీటిపారుదల శాఖ అధికారులు తమ చెరువుపై దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలానికి చెందిన డి.సూర్య ప్రకాశ్ తమ భూమికి పట్టాధారు పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు అందించారు. తమ ఉద్యోగాల రెన్యువల్ కోసం ఇటీవల టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీ పెట్టుకోగా తమ సమస్య పరిష్కరించారని అర్జీదారు పద్మ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా వివిధ సమస్యలపై బాధితులు అర్జీలు అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని నేతలు వారికి హామీ ఇచ్చారు.

ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, ఢిల్లీ జట్లు



విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీ ఆవరణలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్ఏపీ), కృష్ణాజిల్లా అండర్ - 19 విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఈ పోటీలు విజయవాడలో జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 26 జట్లు పోటీలలో పాల్గొనగా, లీగ్ కమ్ నాకౌట్ విధానంలో మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. పోటీలలో భాగంగా మంగళవారం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. లీగ్ మ్యాచ్‌ల కోసం ఆయా జట్లను 8 పూల్స్‌గా విభజించారు. లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్న జట్ల లో ఆతిధ్య ఆంధ్రప్రదేశ్ తోపాటు మధ్యప్రదేశ్, ఢిల్లీ, కర్నాటక, హిమా చల్‌ప్రదేశ్, కేరళ, ఛత్తీస్ గఢ్, ఉత్తరప్రదేశ్, మహా రాష్ట్ర, తమిళనాడు, సీఐఎస్‌సీఈ జట్లు ఉన్నాయి. కాగా, ప్రీ క్వార్టర్ ఫైనల్, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉదయం నిర్వహించనున్నారు.

ఇదిలావుండగా, ఆతిధ్య ఆంధ్రప్రదేశ్ జట్టు లీగ్ మ్యాచ్‌లలో తన సత్తా చాటుకుంది. ఆడిన రెండు మ్యాచ్‌లలనూ ఘన విజయాలను నమోదు చేసుకుని ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. హెచ్ - పూల్‌లో ఏపీతోపాటు మధ్యప్రదేశ్ జట్టు కూడా ప్రీ క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. కాగా, మరో తెలుగు రాష్ట్రం తెలంగాణ మూడు మ్యాచ్‌లు ఆడగా, కేవలం ఒక్క మ్యాచ్‌లోనే

లీగ్ మ్యాచుల్లో సత్తా చాటిన ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు

విజయం సాధించి, రెండింటిలో ఓటమిని చవి చూసింది. ఇదిలావుండగా, ఎఫ్-పూల్‌లో కర్నాటక ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలుపొందగా, ఒడిశా ఒక్క మ్యాచ్‌లో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌కు అర్హత పొందాయి.

రెండో రోజు ఫలితాలుః ఆంధ్రప్రదేశ్ జట్టు చండీఘడ్‌పై 25-12, 25-11, 25-13తో గెలుపు, హిమాచల్‌ప్రదేశ్ జట్టు పంజాబ్‌పై 18-25, 25-16, 23-25, 25-17, 17-15తో గెలుపు, ఉత్తరాఖండ్ జట్టు చండీఘడ్‌పై 25-15, 25-27, 18-25, పంజాబ్ జట్టు తెలంగాణపై 25-18, 25-15, 25-18 స్కోర్‌తోనూ, కర్నాటక జట్టు ఒడిశాపై 25-12, 25-13, 25-14తోనూ, తమిళనాడు జట్టు విద్యా భారతీ జట్టుపై 25-12, 25-3, 25-3తోనూ, మహారాష్ట్ర జట్టు రాజస్థాన్‌పై 23-25, 19-25, 25-20, 26-24, 15-12తోనూ, కేరళ జట్టు జమ్ము కాశ్మీర్‌పై 25-19, 25-13, 25-14తోనూ, గుజరాత్ జట్టు హర్యానపై 23-25, 25-19, 25-18, 25-17తోనూ, పశ్చిమ బెంగాల్ జట్టు ఢిల్లీపై 25-7, 25-11, 25-14 స్కోర్‌తోనూ గెలుపొందాయి.

ఖాళీ స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఖాళీ స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా స్థానిక ఏపీ ఐఐసీ కాలనీ, ఆచార్య రంగా రోడ్, గురునానక్ కాలనీ, హై టెన్షన్ రోడ్, ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ఉన్న అన్ని పార్కుల్లో మరమతులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆచార్య రంగా నగర్‌లో త్వరితగతిన రోడ్డు మరమ్మతులు చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్ఈ పి.సత్యనారాయణను ఆదేశించారు. గురునానక్ కాలనీ ప్రాంతంలో డివైడర్ల మధ్య గ్రీనరి పెంచి, కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ డీడీ రామ్మోహన్‌ని ఆదేశించారు. అనంతరం హై టెన్షన్ రోడ్డు విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలను త్వరిత గతిన తీసుకోవాలని చీఫ్ సిటీ ప్లానర్ జీవిజీఎస్‌వి.ప్రసాద్‌ను ఆదేశించారు. ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల పరిశీలించి గర్బిష్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్లో సరైన ఎగ్జిట్, షెడ్యూల్ పనులను తక్షణం ప్రారంభించాలని ఎస్ఈ పి.సత్యకుమారిని ఆదేశించారు. మాహానాడు రోడ్డు వద్ద డ్రెయిన్లను నిర్మాణం చేపట్టాలని సామ్రాజ్యంను ఆదేశించారు.

తిలక్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర డీజీపీ సీపీఆర్‌వో బాలగంగాధర్ తిలక్‌కు ఘన సన్మానం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నగరంలోని ఒ హొటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ ఉన్నతమైన శాఖలో ఉంటూ పలువురికి ఆదర్శవంతంగా వుండే గొప్ప వ్యక్తిత్వం ఉన్న తిలక్‌ను సన్మానించడం సంతోషదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లి బోయిన రాజు ,రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగనబోయిన సాంబశివరావు,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దుప్పుల శివాజీ ముదిరాజ్ ,మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు తోకల రవి, పాలిపోయిన చిన్నారి,వాసు బాబు ,తెలంగాణ నాయకులు వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.